# ఆధునిక నీతి కథలు



## వాల్లూరు నాగేశ్వరరావు

జీవితాన్ని ఓ పర్వతంగా భావించి, ఆ పర్వతంతో 'ఢీ'కొని విజయాన్ని సాధించాలనే సూటిమనిషి పర్వతాలరావు. పుట్టింది పేదకుటుంబంలో. పెరిగింది పదిమంది దయాధర్మాలపైన. ఎందుకంటే, అతని చిన్న వయస్సులోనే తల్లి దండ్రులు పోయారు. అతన్ని తప్ప అతనికి అర్ధరూపాయిఆస్థి కూడా మిగిల్చి వెళ్ళలేదు అతని తల్లిదండ్రులు. కేవలం స్వయంకృషిపైనే, సొంత తెలివి తేటలతోనే, యాంత్రికమైన పరిశ్రమతోనే బి.ఏ. దాకా చదివి, అందులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అయినా ఉద్యోగం కోసం ఎంతో మందిని ఆశ్రయించాడు. ఎన్నో ఇంటర్‌వ్యూలకు హాజరయ్యాడు. హాజరయిన ప్రతి ఇంటర్వ్యూలోనూ సభ్యుల్ని మెప్పించేడు. అయితే ఒక మహానుభావుడు పర్వతాల రావు విద్యావిషయిక ఔన్నత్యాన్నీ, ఇంటర్‌వ్యూలో చూపిన సామర్థ్యాన్నీ, అతని స్థితిగతుల్నీ గ్రహించి ఉద్యోగం ఇచ్చాడు లిమిటెడ్ కంపెనీలో కిందిస్థాయి గుమాస్తాగా.

ఆ కంపెనీలో చేరినదగ్గర్నుంచీ పర్వతాలరావు తన సామర్థ్యాన్ని, తెలివి తేటల్ని నిరూపించుకోవడానికీ, పై అధికార్ల మెప్పును పొందడానికీ క్షణం వృథా చేయలేదు. ఠంచన్‌గా తొమ్మిదిన్నరకు ఆఫీసుకు వచ్చేవాడు. కుర్చీలో కూర్చున్న దగ్గర్నుంచీ లంచ్ టైమ్‌లో అరగంట తప్ప మళ్ళీ సాయంత్రం ఆఖరవ్వేవరకూ, ఆ కుర్చీకే అంకితమైపోయేవాడు. ఇచ్చిన పనిని కడు జాగ్రత్తగా అమిత వేగంగా చేసేవాడు. ఆఫీసుటైమ్‌లో ఎవ్వరితో మాట్లాడే వాడు కాదు. ఆఫీసు విధులకు అంత యిదిగా కట్టుబడి, గానుగెద్దులా పర్వతాలరావు పనిచేస్తూ వుండడం తోటి గుమాస్తాలకు కన్నెర్రగా వుండేది. జీవితాన్ని ఆఫీసు విధులకు అంకితంచేసే ఉద్యోగులు ఈ రోజుల్లో వెయ్యికి ఒక్కరు కూడా ఉంటారా? ఉంటే ఆ ఒక్కడే పర్వతాలరావుగా చెప్పుకోవచ్చు.

పర్వతాలనావు పని సామర్థ్యం కంపెనీ మేనేజింగ్ డైరక్టరు దాకా వెళ్ళింది. అతన్ని గురించి రహస్య రిపోర్టులు అనుకూలంగా అందాయి. ఒక

రోజు మధ్యాహ్నం మేనేజింగ్ డైరక్టరు నుంచి పిలుపు వచ్చింది పర్వతాలరావుకు. సహం భయంగానూ, సహం బిడియంగానూ మేనేజింగ్ డైరక్టరు ఎయిర్‌కండి షన్డు గదిలోకి వెళ్ళాడు పర్వతాలరావు.

"మిస్టర్ పర్వతాలరావ్ ! మీ గురించి విన్నాను. ఆఫీసు పని సెంట్ పర్సెంట్ వొళ్ళు వంచి పనిచేస్తున్నారని తెలిసింది. ఓ క్షణం కూడా వృధా చేయని మీ సిన్సియారిటీని అభినందిస్తున్నాను."

తనకి మేనేజింగ్ డైరక్టర్ డబుల్ ప్రమోషన్ ఇవ్వబోతున్నంతగా పర్వతాలరావు మొహం మెర్క్యూరీ కాంతిలాగా వెలిగింది.

"మీ వయసెంత ?"

"ఇరవై ఏడేళ్లండీ"

"ఈ వయసుకే ఆఫీసుపనిలో అంత గొప్ప సామర్థ్యాన్ని సంపాయించా రంటే, కంపెనీ వ్యాపారంలో మెలుకువలన్నీ తెలుసుకున్నారంటే సామాన్య మైన విషయం కాదు. మిస్టర్ పర్వతాలరావ్! మీ లాంటి వయసు తక్కువ, తెలివి ఎక్కువ యువకుల్ని చూస్తే మాకో భయం ఏర్పడుతూ వుంటుంది."

పర్వతాలరావు మొహంపై హఠాత్తుగా చిరుచెమట్లు కమ్మాయి. ఆ చెమట్ల ద్వారా అంతదాకా అతని మొహం ఆర్పేసిన దీపమైంది.

"పని బాగా నేర్చుకుని, ప్రావీణ్యం సంపాదించి, వ్యాపార రహస్యాలను తెల్సుకొని, కొన్నాళ్ళు పోయాక మాకు పోటీగా వ్యాపారం పెడుతూ వుంటారు మీలాంటివారు. అందుచేత అలాంటి ప్రమాదం రాకుండా ముందు జాగ్రత్త పడడం మా కర్తవ్యం. మీలాంటివారికి ఉద్వాసన చెప్పడం మా వ్యాపారధర్మం. మీరేమి అనుకోకండి. మా ధర్మాన్ని మేము పాటించాలి. రేపే మీ జీతాన్ని, అలవెన్సులనూ, బోనస్‌నూ తీసుకొని మరోచోట ఉద్యోగం చూసుకోండి." అన్నాడు మేనేజింగు డైరక్టరు ముందున్న ఫైల్లోకి మొహం దూర్చి.

*ఉద్యోగం వెలయాలేగానీ ఇల్లాలు ఎప్పటికీ కాదు.*